సాక్షి ఖమ్మం

గురువారం । 1 । ఆగస్టు । 2024



జిల్లా రిజిస్ట్రార్‌గా రవీందర్‌రావు

జిల్లా రిజిస్ట్రార్‌గా అశోక్‌కుమార్ స్థానంలో రవీందర్‌రావు బదిలీపై రానుండగా పలువురు సబ్ రిజిస్ట్రార్లకూ స్థానచలనం కలిగింది. 8లో



భోజనం ఎలా ఉంది !?

కలెక్టర్ ఆదేశాలతో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసి నాణ్యతపై ఆరా తీశారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 25°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షం కురిసే అవకాశముంది. మధ్యాహ్నం మాత్రం సాధారణ ఉష్ణోగ్రత నమోదవుతుంది.

న్యూస్‌రీల్

కూసుమంచి కాలేజీలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్/కూసుమంచి: జిల్లాలోని కూసుమంచిలో ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించగా ఉద్యోగుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. గెస్ట్ లెక్చరర్లు 12మంది, బోధనేతర సిబ్బంది ఆరుగురిని ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించనున్నట్లు వెల్లడించారు. వివిధ సబ్జెక్టుల అధ్యాపకులతో పాటు జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. ఆసక్తి అర్హతలు కలిగిన వారు బయోడేటా ఫారంతో పాటు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ మెమోలు, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ పత్రంతో పాటు స్థానికత లేదా 4నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్ల జిరాక్స్‌లు జత చేసి కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 3వ తేదీలోగా అందించాలని డీఐఈఓ సూచించారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత : సీపీ



విశ్రాంతి గదిలో పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని సీపీ సునీల్‌దత్ తెలిపారు. ఖమ్మంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్మించిన వసతి గదులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విధినిర్వహణలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చే సిబ్బందికి వసతి లేని విషయాన్ని పరిగణనలోకి తీసుకుని విశ్రాంతి గదులు నిర్మించామని తెలిపారు. అనంతరం సీపీ హోంగార్డు కార్యాలయం, క్లూస్ టీమ్ కార్యాలయాలను సందర్శించారు. ఏఆర్ అడిషనల్ డీసీపీ విజయబాబు, ఏఆర్ ఏసీపీలు సుశీల్‌సింగ్, నర్సయ్య, ఆర్‌ఐలు కామరాజు, శ్రీశైలం, అప్పలనాయుడు, సురేష్ నాగేశ్వరరావు, సాంబశివరావు, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

కూసుమంచి: పాలేరులోని మత్స్య పరిశోధన స్థానంలో సాంకేతిక శిక్షణ బదిలీ-క్షేత్రస్థాయి సందర్శన అంశంపై మూడురోజులుగా ఇస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. నాగర్‌కర్నూలు జిల్లా కోడేరు మండలంలోని పలు సంఘాల మత్స్యకారులు శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్య శాఖ అధికారి జి.రాజనర్సయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను మత్స్యరైతులు సద్వినియోగం చేసుకుని ఆదాయం పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఆగ్రోస్ స్టేట్ కోఆర్డినేటర్ సునీల్‌కుమార్ మాట్లాడగా శాస్త్రవేత్తలు లవకుమార్, రవీందర్‌తో పాటు కొమ్ము మధు, టి.జగదీష్, నాగరాజు, భార్గవి పాల్గొన్నారు.

భూసేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి


ఖమ్మంఅర్బన్: జాతీయ రహదారి పనులకుగాను భూసేకరణ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. ఖమ్మంలోని ధంసలాపురం వద్ద హైవేలో భాగంగా ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ మంజూరు కాగా.. క్షేత్రస్థాయిలో బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ భూమి సేకరించనున్న నేపథ్యాన బాధితులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. ఈమేరకు అధికారులు మార్కింగ్ చేసి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. ఖమ్మం ఆర్డీఓ జి.గణేష్, తహసీల్దార్ సీహెచ్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

'గ్రీవెన్స్' దరఖాస్తులన్నీ పరిష్కరించండి

ఖమ్మం సహకారనగర్: ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్ డేలో అందుతున్న దరఖాస్తులన్నీ తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ సూచించారు. ఆయన కలెక్టరేట్ నుంచి బుధవారం టెలీ కాన్ఫరెన్స్ జిల్లా అధికారులతో సీఎం ప్రజాపాలన, గ్రీవెన్స్ డే అర్జీలు, ఆర్టీఐ, కోర్టు కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులపై 3వ తేదీలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని తెలిపారు. కాగా, వచ్చే సోమవారం నుంచి సోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగే ప్రజావాణికి మండల స్థాయి అధికారులంతా హాజరయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు.

మాఫీలో చిక్కుముడులు





కలెక్టరేట్‌లోని ప్రత్యేక సెల్‌లో ఫిర్యాదు చేస్తున్న రైతులు (ఇన్‌సెట్) పేర్లు ఒకేలా లేవని చెబుతున్న పోర్టల్

- తప్పులతడకగా రుణమాఫీ జాబితాలు
- ఆధార్, బ్యాంకు ఖాతాలో వేర్వేరుగా పేర్లు
- రూ.వేలకు బదులు రూ.వందల్లోనే నగదు జమ
- రుణమాఫీకి దూరమైన వేలాది రైతులు

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రుణమాఫీలో అడుగడుగునా చిక్కులు ఎదురవుతున్నాయి. జిల్లాలో రుణమాఫీ కోసం లక్షలాది మంది రైతులు ఎదురు చూస్తుండగా కేవలం వేల సంఖ్యలో మాత్రమే ఫలితం దక్కింది. అందులోనూ సవాలక్ష లోపాలు వెలుగు చూస్తున్నాయి. ప్రభుత్వ శాఖలు, బ్యాంకర్లు రూపొందించిన జాబితాల్లో తప్పులు దొర్లటం రైతుల పాలిట శాపంగా మారింది. బ్యాంకులు, సహకార సంఘాల్లో రూ.వేలల్లో అప్పు తీసుకున్న రైతులకు రూ.వందలు, రూ.పదుల్లో నగదు జమ అయింది. దీంతో ఆయా రైతులు వ్యవసాయాధికారులు, బ్యాంకర్లను కలిసి ఆరా తీస్తుండగా రానున్న జాబితాలో మాఫీ అవుతుందని సర్దిచెప్పి పంపిస్తున్నారు.

జిల్లాలో 3.21లక్షల మంది అర్హులు

2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9నాటికి రైతులు తీసుకున్న రూ.2 లక్షల మేర పంట రుణాల మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో జిల్లాలో దాదాపు 3.21 లక్షల మంది రైతులకు రూ.2,300 కోట్ల మేర రుణం మాఫీ అవుతుందని ఆశించారు. ఇప్పటికే రెండు విడతలు పూర్తికాగా.. జిల్లాలో 91,799 మంది రైతులకు రూ.520.76 కోట్లు మాత్రమే విడదలయ్యాయి. రూ. లక్ష లోపు, రూ. 1.50 లక్షల వరకు రుణాలు తీసుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ లక్ష మందికి కూడా రుణమాఫీ కాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

లోపాలమయంగా జాబితాలు

జిల్లాలోని 30 వాణిజ్య, సహకార బ్యాంకుల నుంచి రుణమాఫీ అర్హుల జాబితాను పంపించారు. అయితే, జాబితాల రూపకల్పన సమయంలో తప్పులు దొర్లినట్లు అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించకుండా జాబితాలు రూపొందించిన క్రమాన అర్హులైన రైతులకు రుణమాఫీ జరగలేదని తెలుస్తోంది.

పేర్లు సరిపోలక...

వేలాది మంది రైతుల ఆధార్ కార్డులో ఉన్న పేరు, బ్యాంక్ ఖాతాలోని పేరు సరిపోవడం లేదని తెలుస్తోంది. ఈనేపథ్యాన ఆధార్ కార్డులోని పేరును పరిశీలిస్తే బ్యాంకు ఆన్‌లైన్‌లో రుణం తీసుకున్న వ్యక్తి పేరు ఒకేలా లేకపోవడంతో రుణమాఫీ నగదు జమ కావడం లేదని సమాచారం. ఈ సమస్య పీఏసీఎస్‌లు, డీసీసీబీ బ్రాంచ్‌ల్లో ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది.

రుణమాఫీ రూ.3 !

బ్యాంకర్లు సిఫారసు చేసిన దానికి భిన్నంగా పలువురికి అతి తక్కువగా రుణమాఫీ జరిగింది. కూసుమంచి మండలం కల్లూరుగూడెం పీఏసీఎస్ పరిధిలో చెరుకుపల్లి పెద్ద వెంకన్న రూ.62,417 రుణం తీసుకోగా ఆయనకు రూ.859 మాత్రమే జమ అయినట్లు జాబితాలో ప్రకటించారు. ఇంకొందరికి రూ.3, రూ.20 కూడా జమ కావడం గమనార్హం. జిల్లాలోని కల్లూరుగూడెం, తిరుమలాయపాలెం, ఏదులాపురం, లక్ష్మీపురం తదితర చోట్ల ఈ పరిస్థితి నెలకొంది.

కర్షక మిత్ర రైతుల్లో అలజడి

టేకులపల్లిలోని కర్షక మిత్ర (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) సహకార సంఘం సభ్యుల్లో రుణమాఫీపై ఆందోళన నెలకొంది. ఈ సొసైటీలో 1,948 మంది రైతులకు గాను 1,345 మంది రుణమాఫీకి అర్హులుగా తేలింది. కానీ వీరెవరి పేర్లు జాబితాలో లేకపోవడంతో కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక సెల్‌లో సంప్రదించారు. అయినా ఫలితం లేక లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ఆరా తీయగా.. సహకార బ్యాంక్ మాదిరి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూలింగ్ అకౌంట్‌కే రైతుల రుణమాఫీ నగదు అందుతుందని.. ఆపై రైతుల ఖాతాల్లో జమ చేస్తారని చెప్పడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

బ్యాంకుల వారీగా రెండో విడత రుణమాఫీ లబ్ధిదారులు

బ్యాంక్	లబ్ధిదారుల సంఖ్య	రుణ మాఫీ (రూ.ల్లో)
ఏపీజీవీబీ	10,216	104,14,88,153
డీసీసీబీ	13,500	64,07,55,818
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	4,299	43,96,59,776
యూబీఐ	4,586	37,14,98,652
బ్యాంక్ ఆఫ్ బరోడా	461	4,59,92,441
ఐఓబీ	190	1,58,40,177
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	146	1,47,23,221
ఇండియన్ బ్యాంక్	83	80,31,676
పంజాబ్ నేషనల్ బ్యాంక్	35	41,60,749
బ్యాంక్ ఆఫ్ ఇండియా	09	9,95,726
ఐడీబీఐ	09	8,47,722
హెచ్‌డీఎఫ్‌సీ	03	3,86,563
మొత్తం	33,942	262,50,56,893

అందరికీ త్వరలోనే మాఫీ



రైతులతో మాట్లాడుతున్న డీఏఓ విజయనిర్మల

ఖమ్మంరూరల్/ఖమ్మం అర్బన్: అర్హులై ఉండి రుణమాఫీ వర్తించని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. త్వరలోనే కారణాలు ఆరా తీసి అందరికీ లబ్ధి జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం చింతపల్లిలో బుధవారం పర్యటించిన ఆమె రుణమాఫీ నగదు అందిన రైతులతో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ రుణమాఫీ అందిన రైతులు తిరిగి రుణాలు తీసుకోవచ్చన్నారు. మిగతా వారు పూర్తి వివరాలతో ఏఈఓలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం డీఏఓ ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్లలో పర్యటించి పంటల నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. ఏఓలు వి.నాగేశ్వరరావు, బి.కిషోర్‌బాబు, ఏఈఓ అనూషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టులో సాగుకు సై



సాగర్ కాల్వ (ఫైల్)



మంత్రి ఉత్తమ్‌తో చర్చిస్తున్న తుమ్మల

- సాగర్ ఎడమ కాల్వకు రేపు నీటి విడుదల
- ఇప్పటికే వరి నార్లు సిద్ధం చేసుకున్న రైతాంగం
- నీటిపారుదల శాఖ మంత్రితో మంత్రి తుమ్మల భేటీ

ఖమ్మంఅర్బన్: జిల్లాలో సాగర్ ఆయకట్టుకు నీరు అందనుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇప్పటి వరకు సరైన వర్షాలు లేక.. సాగర్ డ్యాం సైతం అడుగంటడంతో ఖరీఫ్ సాగు ఎలా అనే ఆవేదన వెంటాడింది. ఇంతలోనే శ్రీశైలం ప్రాజెక్టు నిండగా పది గేట్లు ఎత్తి సాగర్ డ్యాంకు నీరు విడుదల చేశారు. జిల్లా జలవనరుల శాఖ అధికారులకు బుధవారం అందిన సమాచారం మేరకు సాగర్ డ్యాంలోకి 525 అడుగుల మేర నీరు చేరింది. అంతేకాక ఇన్‌ఫ్లో 2.17 లక్షల క్యూసెక్కులు ఉండడంతో ఇప్పటికే కుడి కాల్వకు 6 వేల క్యూసెక్కుల మేర విడుదల చేశారు. ఎడమ కాల్వకు సైతం శుక్రవారం నీరు విడుదల చేయాలని ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు చెందిన మంత్రులు నిర్ణయించారు.

2.55లక్షల ఎకరాల ఆయకట్టు

జిల్లాలోని 17 మండలాల పరిధిలో సాగర్ ఆయకట్టు 2.55 లక్షల ఎకరాలుగా ఉంది. ఇప్పటికే రైతులు దుక్కులు దున్ని వరి నారు సిద్ధం చేసుకుని నీటి కోసం ఎదురుచూస్తుండగా షెడ్యూల్ ఖరారైంది. గత ఏడాది వానాకాలంలో వారబందీ విధానంలో సాగర్ నీటిని విడుదల చేసిన అధికారులు పంట పూర్తయ్యే వరకు అష్టకష్టాలపై అందించగలిగారు. ఇక వేసవిలో అధికారులు వద్దన్నా రైతులు కొన్నిచోట్ల సాగు చేశారే తప్ప మిగతా భూమి వదిలేశారు. ఈసారి కూడా వానాకాలం ఆరంభంలో సరైన వానలు లేక రైతులు సందిగ్ధావస్థ ఎదుర్కొన్నారు. ఇంతలోనే సాగర్ జలాల విడుదలకు నిర్ణయించిన నేపథ్యాన వరి నార్లు పోసిన రైతులు నాట్లకు సిద్ధమవుతున్నారు. కాగా, విడుదలయ్యే నీటిని తాగునీటి అవసరాల కోసం సాగర్ కాల్వల పరిధిలో ఖాళీగా ఉన్న చెరువులకు వదిలి.. ఆతర్వాత షెడ్యూల్ ఆధారంగా ఆయకట్టుకు విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

సాగర్ జలాలపై మంత్రుల చర్చ

జిల్లాలోని ఆయకట్టుకే కాక తాగు నీటి అవసరాల కోసం సాగర్ జలాలను విడుదల చేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో మంత్రులు బుధవారం భేటీ అయి చర్చించారు. ఈనెల 2న శుక్రవారం నీటి విడుదలకు అంగీకరించిన మంత్రి ఉత్తమ్.. నీటిని పొదుపుగా వాడుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

స్పందించలేదనే మాట రావొద్దు..

- రెవెన్యూ సంబంధిత సమస్యలన్నీ పరిష్కరించడి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: రెవెన్యూ సంబంధిత సమస్యలన్నీ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన రెవెన్యూ అధికారులతో ధరణి, ప్రజావాణి, ధృవీకరణలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని.. ఇందుకోసం ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. తద్వారా తహసీల్‌లో స్పందించలేదనే మాట రాకుండా చూసుకోవాలన్నారు. ప్రతీ తహసీల్, ఆర్డీఓ కార్యాలయాల్లో ధరణి సహాయక కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అంతేకాకుండా ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించి కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాల జారీ, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. అలాగే, ప్రభుత్వ స్థలాల పరిరక్షణపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఆర్డీఓలు జి.గణేష్, ఎల్.రాజేందర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రోటరీనగర్ పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

విద్యార్థుల్లో కనీస ప్రమాణాలు పెంపొందించాలి

ఖమ్మంఅర్బన్: విద్యార్థుల్లో కనీస ప్రమాణాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. ఖమ్మం రోటరీనగర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌ను తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉండడమే కాకుండా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం సమకూరుస్తున్నందున బోధనపై దృష్టి సారించాలని తెలిపారు. ఆతర్వాత పాఠశాలలో వసతులను పరిశీలించిన ఆయన క్రీడా మైదానం లేదని గుర్తించారు. పాఠశాల సమీపాన వీధి వ్యాపారుల ప్రాంగణం ఖాళీగా ఉన్నందున మైదానంగా ఉపయోగించుకోవాలని తెలిపారు. ఆతర్వాత విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, హెచ్‌ఎం పి.పద్మ, ఉపాధ్యాయులు డీ.వీ.నాగేంద్రబాబు తదితరులు ఉన్నారు.

వైరా రిజర్వాయర్‌లో చేపల వేట

- నామమాత్రంగానే లభించిన మీనాలు
- నిరుత్సాహంలో మత్స్యకారులు



చేపలు దక్కించుకునేందుకు పోటీ పడుతున్న స్థానికులు



రిజర్వాయర్‌లో లభించిన భారీ చేపతో యువకుడు

వైరా: చాన్నాళ్ల తర్వాత వైరా రిజర్వాయర్‌లో బుధవారం చేపల వేట ప్రారంభమైంది. గత నాలుగు నెలలుగా రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీరు లేకపోవడంతో వేటకు అంతరాయం ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు క్రమేపీ నీరు పెరగడంతో మత్స్యకారులు చేపల వేటకు ఉపక్రమించారు. ఈనేపథ్యాన బుధవారం తెల్లవారుజామునే వేటకు దిగగా గతంతో పోలిస్తే ఆశించిన స్థాయిలో చేపలు లభించకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు. మరో వైపు మత్స్య సహకార సొసైటీ సభ్యులు ముందుగానే చేపల విక్రయానికి ఓ కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకోగా ఆయన ఢిల్లీ, కేరళ, ముంబై, కోల్‌కతాకు తరలించేందుకు కంటైనర్లు తీసుకొచ్చాడు. అయితే, 400 టన్నుల మేర సరుకు లభిస్తుందని భావిస్తే మొదటి రోజు 50 టన్నులు కూడా దాటలేదు. ఇక స్థానికులు సైతం ఉదయాన్నే రిజర్వాయర్ వద్దకు చేరుకుని చేపల కొనుగోలుకు పోటీ పడినా తొలుత కాంట్రాక్టర్‌కే ఇవ్వాల్సి ఉండడంతో చాలామందికి లభించలేదు. ఐదు కేజీల నుంచి ఆరు కేజీల బరువైన బొచ్చ, రవ్వు, బంగారు తీగ, పాంప్లెట్ తదితర రకాల చేపలు వలల్లో చిక్కాయి.

నిలకడగా గోదావరి

కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

భద్రాచలం అర్బన్: భద్రాచలం వద్ద గోదావరి నిలకడగా ప్రవహిస్తోంది. బుధవారం తెల్లవారుజామున 4గంటలకు 44.2 అడుగులు ఉన్న గోదావరి స్వల్పంగా పెరిగి మధ్యాహ్నం 12 గంటలకు 45 అడుగులకు చేరింది. ఆతర్వాత ప్రవాహం సాయంత్రం వరకూ స్థిరంగా కొనసాగింది. రాత్రి 11గంటలకు 44.40 అడుగులకు చేరింది. కాగా, 43 అడుగులకు పైగానే నీటిమట్టం ఉండడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. అలాగే, అశోక్‌నగర్ కాలనీకి చెందిన 44 కుటుంబాలు, ఏఎంసీ కాలనీకి చెందిన 10 కుటుంబాల వారు ఇంకా పునరావాస శిబిరంలోనే ఉన్నారు. ఇతర కాలనీల వాసులు మాత్రం ఇళ్లకు వెళ్లిపోయారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బ్లీచింగ్, శానిటేషన్ పనులు చేపడుతున్నారు.

పెండింగ్‌లో బిల్లులు..

- ఈ-ఆఫీస్‌లో నిలిచిపోవడమే కారణం
- ఇంజనీర్ల బదిలీలతోనూ జాప్యం
- పారిశుద్ధ్య వాహనాలకు డీజిల్ నిలిపివేత

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లులు అందక కాంట్రాక్టర్లు ఇక్కట్లు పడుతున్నారు. నెలల తరబడి బిల్లులు మంజూరు కాకపోవడంతో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇక రోజువారీ ఒప్పందంపై కార్మికులతో పని చేయించే కాంట్రాక్టర్లు సైతం కూలీలకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని చెబుతున్నారు. వివిధ పనులకు సంబంధించి సుమారు రూ.30 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

'కీ' రాకపోవడంతో..

బిల్లులు ఈ - ఆఫీస్‌లో పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇంజనీరింగ్ విభాగంలో బిల్లులు రూపొందించాక కమిషనర్ ఆమోదం కోసం ఈ-ఆఫీస్‌లో సమర్పిస్తారు. అయితే, కార్పొరేషన్ కమిషనర్‌గా అభిషేక్ అగస్త్య కొన్నాళ్ల క్రితమే విధుల్లో చేరగా ఆయనకు లాగిన్ కీ రావడంలో ఆలస్యమైందని సమాచారం. తాజాగా కీ రావడంతో ఇన్నాళ్లు పెండింగ్ ఉన్న బిల్లులను పరిష్కరిస్తున్నట్లు తెలిసింది. అంతేకాక ప్రతీ బిల్లును కమిషనర్ నిశితంగా పరిశీలించాకే సంతకం చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. పారిశుద్ధ్య వాహనాల ఇంధనంపై కూడా మైలేజీ, ట్రిప్పుల వివరాలను సైతం ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

ఆందోళనలో కాంట్రాక్టర్లు

కేఎంసీలో పని చేస్తున్న ముగ్గురు ఏఈలు ఇటీవల బదిలీ అయ్యారు. క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించి ఎంబీ రికార్డులను ఏఈలు రూపొందించాల్సి ఉంటుంది. కానీ ఏఈలు బదిలీ కావడం.. కొత్తవారు వచ్చినా అవగాహన లేకపోవడంతో త్వరగా బిల్లులు మంజూరు కావడం లేదనే చర్చ జరుగుతోంది.

డీజిల్ నిలిపివేత

నెల రోజులుగా బిల్లులు అందడం లేదంటూ పారిశుద్ధ్య వాహనాలకు డీజిల్ పోసే రామన్నపేట సమీపంలోని బంక్ యాజమాన్యం బుధవారం సరఫరా నిలిపివేసింది. నెల క్రితం కూడా ఇదే పరిస్థితి ఎదురుకాగా అప్పటికప్పుడు రెండు నెలల బిల్లులు చెల్లించారు. మళ్లీ నెల రోజులుగా నగదు అందకపోవడంతో బుధవారం సరఫరా నిలిపివేయగా అధికారులు గంటల వ్యవధిలోనే బిల్లులు సిద్ధం చేసి నిధులు జమ చేశారు. దీంతో బంక్ యాజమాన్యం డీజిల్ పోయడంతో పారిశుద్ధ్య వాహనాలు ముందుకు కదిలాయి.

సాంకేతికతతో లాభాల 'పంట'



డ్రోన్ ద్వారా మందుల పిచికారీని పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

రైతులు సంప్రదాయ విధానాలకు తోడు సాంకేతికతను అంది పుచ్చుకుంటే అధిక దిగుబడులు సాధించొచ్చని ఖమ్మం ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు తెలిపారు. కామేపల్లి మండలం ముచ్చర్లలో రైతు తీర్థాల చిదంబరరావు సాగు చేసిన మొక్కజొన్న పంటపై డ్రోన్ ద్వారా పురుగు మందును పిచికారీ చేయించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా మందుల పిచికారీతో కూలీల కొరతను అధిగమించడమే కాక డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. ఏఓ భూక్యా తారాదేవి, ఏఈఓ ఉషా, జగదీశ్వర్, రైతులు పాల్గొన్నారు. – కామేపల్లి

క్లుప్తంగా

చిన్నారికి నాట్యమయూరి అవార్డు



నాట్యమయూరి అవార్డుతో భువనచంద్రిక

ఖమ్మంరూరల్ : మండలంలోని సూర్యనగర్‌కు చెందిన చిన్నారి గండికోట భువనచంద్రికకు నాట్య మయూరి అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి భరతనాట్యం పోటీల్లో భువన అద్భుత ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా చిన్నారికి అవార్డు అందజేసి అభినందించారు. కాగా, భువనచంద్రిక ఖమ్మంలోని ఓ ఇనిస్టిట్యూట్‌లో భరతనాట్యంలో శిక్షణ పొందుతోంది.

4న అండర్-23 అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: అండర్-23 విభాగంలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఈనెల 4న నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే ఎంపిక పోటీలకు క్రీడాకారుల వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 8 గంటలకల్లా హాజరుకావాలని సూచించారు. ఇక్కడ ప్రతిభ చాటిన వారిని మెదక్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నీకి ఎంపిక చేస్తామని తెలిపారు.

డిగ్రీలో ప్రవేశాలకు రేపు స్పాట్ కౌన్సెలింగ్

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు కల్పించేందుకు శుక్రవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి శ్రీవాణి తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీజెడ్‌సీ లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ కౌన్సెలింగ్ ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ప్రవేశ పరీక్ష రాయని వారు కూడా నేరుగా హాజరు కావొచ్చని, ఈ అవకాశాన్ని గిరిజన బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు మూడో విడత కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌ను పర్యవేక్షిస్తున్న ఆర్‌సీఓ, ప్రిన్సిపాళ్లు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో సీట్ల భర్తీకి బుధవారం మూడో విడత స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. భద్రాచలంలోని గిరిజన గురుకుల పాఠశాలలో జరిగిన కౌన్సెలింగ్‌ను ఆర్‌సీఓ నాగార్జునరావు పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల విభాగంలో 72 సీట్లకు పది, బాలుర విభాగంలో 286 సీట్లకు గాను ఏడు సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ప్రిన్సిపాళ్లు జాన్‌నాయక్, పద్మావతి, హరికృష్ణ, భాస్కర రావు, రాణి, రమేష్, రాజారాం పాల్గొన్నారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని ఏనెకుంట తండాకు చెందిన వృద్ధురాలు పాముకాటుతో మృతి చెందింది. గ్రామానికి చెందిన వాంకుడోత్ బద్రి(80) మంగళవారం రాత్రి ఇంట్లో పడుకోగా పాము కాటు వేసింది. దీంతో ఆమె కేకలు వేస్తుండగా కుటుంబీకులు పామును చంపి బద్రిని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బద్రి మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మణుగూరు టౌన్: మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. కార్నిక శేఖర్(29) వివాహం జరగకపోవడంతో కొంతకాలంగా మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో 29న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మణుగూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,250	2,250
పెసలు	7,500	6,200
కందులు	10,600	10,600
మిర్చి	17,600	9,200
ఏసీ మిర్చి	19,400	10,000
ఏసీ తాలు	10,400	8,000
పత్తి	7,250	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,705



ఖమ్మం రూరల్ : కామంచికల్‌లో బోధనను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ సన్యాసయ్య



ఖమ్మం వ్యవసాయం : ఇందిరానగర్ పాఠశాలలో భోజనం చేస్తున్న డీఏఓ విజయనిర్మల



మధిర రూరల్ : జిలుగుమాడు పాఠశాలలో భోజనం చేస్తున్న ఎస్పీ డీడీ సత్యనారాయణ

భోజనం ఎలా ఉంది..!?

ప్రభుత్వ పాఠశాలల్లో అధికారుల మధ్యాహ్న భోజనం

- మెనూ అమలు, నాణ్యతపై ఆరా
- బోధనపై ఉపాధ్యాయులకు సూచనలు



వైరా రూరల్ : రెబ్బవరంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ శర్మ

సాక్షి నెట్‌వర్క్: ప్రతీ బుధవారం జిల్లా స్థాయి అధికారులంతా ఏదో ఒక ప్రభుత్వ పాఠశాలలో భోజనం చేయాలన్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగారు. ఈ నేపథ్యాన వివిధ పాఠశాలల్లో భోజనం చేసిన అధికారులు నాణ్యత, మెనూపై అమలుపై విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. అంతేకాకుండా భోజన తయారీపై నిర్వాహకులకు సూచనలు చేశారు. అలాగే, బోధన, విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపుపై దృష్టి సారించాలని సూచించడమే కాక పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటారు. వైరా మండలం రెబ్బవరంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ భోజనం చేయగా.. ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే, వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్ సందర్శించారు. ఖమ్మంరూరల్ మండలం కామంచికల్‌లోని ఉన్నత పాఠశాలలో డీఆర్‌డీఓ సన్యాసయ్య భోజనం చేశారు. రఘునాథపాలెం ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ పద్మయ్యనాయుడు, ఈసీ దీపక్, కార్యదర్శి రాంబాబు, రూరల్ ఏపీఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇక జలగంగనర్‌లోని నేలకొండపల్లి మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.ఏ.మహమూదీ సందర్శించి భోజనం చేశారు. ఖమ్మం ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) ఎం.విజయనిర్మల, మధిర మున్సిపాలిటీ పరిధి జిలుగుమాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో సాంఘిక సంక్షేమ శాఖ కస్తాల సత్యనారాయణ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ వెంకటేశ్వర్లు, వార్డెన్ సలీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైరా : గురుకులంలో మొక్క నాటుతున్న డీఎస్‌ఓ చందన్‌కుమార్

నాణ్యతకు, నమ్మకానికి భరోసా భారతి సిమెంట్



డీలర్‌ను సన్మానిస్తున్న భారతి సిమెంట్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) మల్లారెడ్డి తదితరులు

ఖమ్మంమయూరి సెంటర్: నాణ్యతలో మేటిగానే కాక నమ్మకంలో భారతి సిమెంట్ భరోసాగా నిలుస్తోందని భారతి సిమెంట్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్(మార్కెటింగ్) ఎం.సీ.మల్లారెడ్డి తెలిపారు. ఖమ్మంలో బుధవారం జరిగిన జిల్లా డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రారంభించినప్పటి నుంచి వినియోగదారుల నమ్మకాన్ని చూరగొంటూ విశేష ఆదరణ పొందుతోందన్నారు. వికాట్ సంస్థ ఆధ్వర్యాన దేశంలో 16 సిమెంట్ పరిశ్రమలు, 267 రెడీమిక్స్, 72 కంకర యూనిట్లు నెలకొల్పగా, ఏటా 50 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదవుతుందని తెలిపారు. అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో భారతి సిమెంట్ ఉత్పత్తి జరుగుతోందని చెప్పారు. అంతేకాక తాపీ మేస్త్రీలకు వ్యక్తిగత బీమా పాలసీ పథకాన్ని అమలు చేస్తున్నామని మల్లారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతి సిమెంట్ సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ టి.కొండల్‌రెడ్డి(మార్కెటింగ్), టెక్నికల్ సర్వీసెస్ డీజీఎం సీ.ఓబుల్‌రెడ్డి, మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ ఎస్.సతీష్‌రాజు, టెక్నికల్ సర్వీసెస్ మేనేజర్ కె.సునీల్ పాల్గొన్నారు.

20వ తేదీలోగా కబడ్డీ అసోసియేషన్ ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: జిల్లాలో కబడ్డీ అసోసియేషన్ బలోపేతం చేసేలా ఈనెల 20వ తేదీలోగా నూతన కమిటీని ఎన్నుకోవాలని సభ్యులు తీర్మానించారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జనరల్ బాడీ సమావేశం జరగగా.. నూతన కమిటీని ఎన్నుకుని మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే, రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలను ఖమ్మంలో నిర్వహించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కటికల క్రిస్టోఫర్ బాబుతో పాటు మేకల మల్లిబాబు యాదవ్, సామినేని హరిప్రసాద్, సుధాకర్, పిచ్చయ్య, నాగార్జున రెడ్డి, అయితం రాజు, డాక్టర్ సుధాకర్, వెల్లంకి స్వామి, ప్రసాద్‌రావు, మోదుగు మోహన్‌రావు, లాలయ్య, మల్లేష్, చిలకా రాములు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై హత్యాయత్నం

పెట్రోల్ పోసి నిప్పంటించిన మరిది కుమారుడు

మధిర: కుటుంబ కలహాల నేపథ్యాన అంగనవాడీ టీచర్‌పై ఆమె మరిది కుమారుడు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మధిర మండలం దెందుకూరులో బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. దెందుకూరు అంగన్‌వాడీ-1 సెంటర్ టీచర్ గుర్రం అరుణను బుధవారం ఆమె భర్త వెంకట్రావు ద్విచక్ర వాహనంపై దింపి పొలానికి వెళ్లిపోయాడు. ఆతర్వాత కాసేపటికి వెంకట్రావు సోదరుడి కుమారుడు సాయికుమార్ చేరుకుని 'నీ భర్త వెంకట్రావు ఎక్కడ.. ఆయనను చంపడానికి వచ్చాను' అంటూ అరుణను ప్రశ్నించాడు. ఇదేమిటని అడుగుతుండగానే సాయికుమార్ తన పెద్దమ్మ అరుణపై పెట్రోల్ ప్యాకెట్లు విసిరి నిప్పంటించాడు. దీంతో మంటల్లో చిక్కుకున్న ఆమె కేకలు వేస్తుండగా స్థానికులు మంటలు ఆర్పి ఆమెను మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఘటనా స్థలాన్ని సీఐ మధు, తహసీల్దార్ రాంబాబు పరిశీలించి అరుణ వద్ద వాంగ్మూలం సేకరించారు.



చికిత్స పొందుతున్న అరుణ

ఆస్తి వివాదాలే కారణమా?

అరుణపై హత్యాయత్నానికి ఆస్తి తగాదాలే కారణమని తెలుస్తోంది. దెందుకూరుకు చెందిన గుర్రం ప్రకాశరావుకు కుమారులు వెంకట్రావు, రాంబాబు ఉండగా.. రాంబాబు ఏడేళ్ల క్రితం మృతి చెందాడు. అయితే, ప్రకాశరావుకు రెండు ఎకరాలు భూమిపై తీసుకున్న రుణం మాఫీ అయింది. ఆ నగదు ఇవ్వాలని రాంబాబు కుమారుడు సాయికుమార్ ఒత్తిడి చేయగా వెంకట్రావు అంగీకరించలేదు. దీంతో సాయి పెదనాన్న వెంకట్రావుపై కక్ష పెంచుకున్నట్లు తెలిసింది. దీనికి తోడు మరికొన్ని కుటుంబ కలహాలు ఉన్నట్లు సమాచారం.

చికిత్స పొందుతున్న బాలుడు మృతి

చింతకాని: రోడ్డుప్రమాదంలో గాయపడిన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాంధీనగర్‌కాలనీ గ్రామానికి చెందిన కుంచాల సందీప్(16) తన స్నేహితులు మహ్మద్ ఇస్మాయిల్, దేవరకొండ జగదీష్‌తో కలిసి మంగళవారం ద్విచక్ర వాహనంపై ఖమ్మం వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ సమీపాన ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో ముగ్గురు గాయపడగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సందీప్ మృతి చెందాడు. ఘటనపై మృతుడి తండ్రి బాలాజీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఏడడుగుల బంధానికి నూరేళ్లు నిండలేదని...

- భర్త మృతి చెందిన నాలుగు రోజులకే భార్య ఆత్మహత్య
- మాజీ సర్పంచ్ మృతితో బిల్లుపాడులో విషాదం



జక్కంపూడి కృష్ణమూర్తి, ప్రేమలత (ఫైల్)

తల్లాడ: ఏడడుగులు నడిచిన సమయాన వందేళ్లు కలిసి ఉంటామని బాసలు చేశారు. ఆనాటి నుంచి అన్యోన్యంగా జీవిస్తున్న వారిలో భర్త కేన్సర్ బారిన పడి మృతి చెందాడు. దీంతో భర్తతో పాటే తన పయనమని భావిస్తూ ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. తల్లాడ మండలం బిల్లుపాడులో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు... బిల్లుపాడుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ జక్కంపూడి కృష్ణమూర్తి అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 26న మృతి చెందాడు. అప్పటి నుంచి ఆయన భార్య ప్రేమలత(66) మనోవేదనతో గడుపుతోంది. ఈక్రమాన మంగళవారం రాత్రి 10 గంటలకు అందరూ నిద్రించాక ఇంటి వెనుకాల మామిడి తోటలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం ఆమె ఇద్దరు కుమారులు చూడగా గదిలో ప్రేమలత లేకపోవడంతో ఇంటి పరిసరాలు, మామిడి తోటలో గాలిస్తుండగా బావిలో మృతదేహం తేలడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, కృష్ణమూర్తి – ప్రేమలత దంపతులు గ్రామానికి నాలుగు పర్యాయాలు 20ఏళ్ల పాటు సర్పంచ్‌లుగా పని చేశారు. కృష్ణమూర్తి 1982, 1991లో, ప్రేమలత 2013, 2019లో వరుసగా రెండు సార్లు సర్పంచ్‌గా గెలిచారు. వీరిద్దరి మృతితో గ్రామంలో విషాదం అలుముకోగా కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.కొండల్‌రావు తెలిపారు. కాగా, ప్రేమలత మృతదేహం వద్ద జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వర్‌రావు, వివిధ పార్టీల నాయకులు వాసిరెడ్డి రామనాథం, పుతుంబాక కృష్ణప్రసాద్, మానుకొండ రాధాకిషోర్, కాపా సుధాకర్, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, డి.వెంకట్‌లాల్, నర్సింహారావు, దీవెల కృష్ణయ్య తదితరులు నివాళులర్పించారు.

పాతర్లపాడులో జ్వరాల తీవ్రతపై ఆరా

- గ్రామంలో పర్యటించిన డీఎంహెచ్‌ఓ



జ్వరంతో మృతిచెందిన శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ మాలతి

సాక్షి ఎఫెక్ట్..

తిరుమలాయపాలెం: మండలంలోని పాతర్లపాడు, తదితర గ్రామాల్లో జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్న అంశంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి మాలతి స్పందించారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో పర్యటించిన ఆమె జ్వరాలతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వివరాలు ఆరా తీశారు. అలాగే, ఇటీవల జ్వరం బారిన పడి మృతి చెందిన జడల శ్రీనివాస్‌గౌడ్ కుటుంబీకులతో మాట్లాడారు. అనంతరం జల్లెపల్లిలో కూడా పర్యటించిన డీఎంహెచ్‌ఓ పిండిప్రోలు జెడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామారావు, అలివేలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడు డెంగీ కేసులు నమోదు

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ పీహెచ్‌సీ పరిధి కోరట్లగూడెం, రాజేశ్వరపురం, బోదులబండల్లో బుధవారం మూడు డెంగీ కేసులు నమోదయ్యాయి. అలాగే, సుర్దేపల్లికి చెందిన పుల్లారావు తీవ్ర జ్వరంతో మండల కేంద్రంలోని ఆస్పత్రికి రాగా స్పృహ కోల్పోయాడు. నేలకొండపల్లి ఆస్పత్రికి సుమారు 200మందికి పైగా బుధవారం జ్వరాలతో వచ్చారని సమాచారం.

జిల్లా రిజిస్ట్రార్‌గా రవీందర్‌రావు

- ప్రస్తుత రిజిస్ట్రార్ అశోక్ హైదరాబాద్‌కు...
- ఉమ్మడి జిల్లాలో పలువురు సబ్ రిజిస్ట్రార్లకూ స్థానచలనం

ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధాప్రకాశ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ చిట్టిమళ్ల అశోక్‌కుమార్‌ను హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేయగా.. ఆయన స్థానంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రిజిస్ట్రార్ రవీందర్ రావును కేటాయించారు. ఇక ఉమ్మడి జిల్లాలోని ఒకరిద్దరు సబ్ రిజిస్ట్రార్లు మినహా మిగతా వారిని ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించగా.. అక్కడి అధికారులను ఖమ్మం బదిలీ చేశారు. ఖమ్మం మార్కెట్ వ్యాల్యూ(ఎం.వీ.) అండ్ ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ అడపా రవీంద్రబాబు మహబూబాబాద్‌కు, కూసుమంచి సబ్‌రిజిస్ట్రార్ జె.రామ నర్సింహారావు వరంగల్ రిజిస్ట్రార్ కార్యాలయం జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1గా బదిలీ చేశారు. కొత్తగూడెం సబ్‌రిజిస్ట్రార్ జి.రాంకుమార్ వరంగల్ డీఐజీ కార్యాలయం సూపరింటెండెంట్‌గా, ఇల్లెందు సబ్‌రిజిస్ట్రార్ సైదులు వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి, ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 ఏ.విజయజ్యోతి ఖమ్మం మార్కెట్ వ్యాల్యూ అండ్ ఆడిట్‌కు, ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2 ఎస్.పద్మ కూసుమంచి సబ్ రిజిస్ట్రార్‌గా కేటాయించారు. ఇక ఖమ్మం ఎం.వీ. అండ్ ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ డి.స్వజన్‌కుమార్ పరకాల సబ్ రిజిస్ట్రార్‌గా, ఖమ్మం అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్ పి.యామిని వరంగల్ అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్‌గా, మధిర ఎస్‌ఆర్‌ఓ ఏ.గిరిధర్ నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి, ఖమ్మం రూరల్ ఎస్‌ఆర్‌ఓ జి.నరేంద్ర వరంగల్ ఫోర్ట్ సబ్ రిజిస్ట్రార్‌గా, కల్లూరు ఎస్‌ఆర్‌ఓ డి.ఆనంద్ వరంగల్ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2గా, సత్తుపల్లి ఎస్‌ఆర్‌ఓ వి.ప్రభాకర్ రావు వర్ధన్నపేట సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు.

జిల్లాకు ఎవరెవరంటే..

జనగామ ఎస్‌ఆర్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న టి.సంపత్‌కుమార్ ఖమ్మం ఆర్‌ఓ కార్యాలయ జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1గా, నిజామాబాద్ ఆర్‌ఓ కార్యాలయం జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 బి.రామచంద్రయ్య వైరా ఎస్‌ఆర్‌ఓగా, వరంగల్ ఆర్‌ఓ కార్యాలయ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2 ఆర్.రాజు మధిర సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై రానున్నారు. వరంగల్ ఎం.వీ. అండ్ ఆడిట్ కె.మోసెస్ భాస్కర్ సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా, వరంగల్ అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్ వి.వేణుమాధవ్ కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్‌గా, వరంగల్ ఫోర్ట్ ఎస్‌ఆర్‌ఓ ఏ.కార్తిక్ ఖమ్మం అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్‌గా, భీమదేవరపల్లి ఎస్‌ఆర్‌ఓ టి.భాగ్యలక్ష్మిని ఖమ్మం ఎం.వీ. అండ్ ఆడిట్‌కు కేటాయించారు. ఇంకా వరంగల్ రూరల్ ఎస్‌ఆర్‌ఓ ఎం.డీ.ఖాజా మసీయుద్దీన్ కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా, నర్సంపేట ఎస్‌ఆర్‌ఓ ఎస్.రామ్‌కిషోర్‌రెడ్డి ఖమ్మం ఆర్‌ఓ జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2గా, వర్ధన్నపేట ఎస్‌ఆర్‌ఓ జె.అరుణ ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై రానున్నారు.

ఖజానా శాఖ డీడీ

ఖమ్మం సహకారనగర్: జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంటపల్లి సత్యనారాయణను మహబూబాబాద్ జిల్లా ట్రెజరీశాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా బదిలీ అయ్యారు. నాలుగేన్నరేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను బదిలీ చేస్తూ శాఖ డైరెక్టర్ కేఎస్ఆర్‌సీ.మూర్తి బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

డిగ్రీ కళాశాలల్లో...

జిల్లా కేంద్రంలోని రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన అధ్యాపకులకు స్థానచలనం కలిగింది. ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు 70మందికి గాను 46మందికి, బోధనేతర ఉద్యోగులు 10మందిలో ఆరుగురు బదిలీ అయ్యారు. అలాగే, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 14మందికి గాను 10మంది అధ్యాపకులు, బోధనేతర ఉద్యోగుల్లో ఆరుగురికి ముగ్గురిని బదిలీ చేశారు. అలాగే, జిల్లాలోని ఇతర డిగ్రీ కళాశాలల్లోనూ అధ్యాపకులు, ఉద్యోగుల బదిలీ ప్రక్రియ పూర్తయింది.

ఫిజికల్ డైరెక్టర్లు...

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాలోని మూడు డిగ్రీ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ల బదిలీ జరిగింది. ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల పీడీ డాక్టర్ బి.వెంకన్న కొత్తగూడెం ఎస్‌ఆర్‌ఎస్ కళాశాలకు, అక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్‌ను ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాలకు కేటాయించారు. అలాగే, మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ డాక్టర్ పి.రఘునందన్‌ను ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలకు కేటాయించారు.

మార్కెట్ ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ మార్కెట్లలోని గ్రేడ్-2 కార్యదర్శులను బదిలీ చేస్తూ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ జి.లక్ష్మీబాయి పేరిట ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఖమ్మం మార్కెట్ గ్రేడ్-2 కార్యదర్శి బి.బజార్‌ను ఏన్కూరుకు, ఏన్కూరులో పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మార్కెట్‌కు బదిలీ చేశారు. అలాగే, హుస్నాబాద్ మార్కెట్ నుంచి వి.స్వజన్‌బాబు ఖమ్మం మార్కెట్ గ్రేడ్-2 కార్యదర్శిగా రానున్నారు.

దేవాదాయ శాఖ ఏసీ నల్లగొండకు..

ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ ఏ.సులోచన నల్లగొండ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆమె పోస్టింగ్ నల్లగొండ జిల్లా చెరువుగట్టు దేవస్థానం ఈఓ అయినప్పటికీ ఖమ్మం ఏసీగా విధులు నిర్వర్తించారు. ఆమెను ప్రస్తుతం నల్లగొండను బదిలీ చేసినా కొత్తగా ఎవరినీ కేటాయించలేదు. ఇక ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానం ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావును ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలోని మారెమ్మ గుడి ఈఓగా, వేంసూరు మండలం కందుకూరు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఈఓ వి.నర్సింహారావును ఖమ్మం ఇందిరానగర్‌లోని పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి, కూసుమంచి శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈఓ శ్రీకాంత్‌ను ఖమ్మం వరదయ్యనగర్‌లోని మైసమ్మ దేవాలయానికి బదిలీ చేశారు.